# వంటింటి లెక్చర్లు (10)
# కలగంటి కలగంటి...

మనసులోని కోరికలకు నిద్రలో పూసిన పూలు కలలు. కళ్ళు మూసుకోగానే చీకటి-ఆ చీకట్లో శరీరంతో మనసు రాపిడి చెందగా పుట్టిన వెలుగు రవ్వలు కావో కలలు ! మనిషికున్న అన్ని హక్కుల్ని తీసిపారెయ్యొచ్చు కాని, కలలు కనే హక్కునెవరూ తుడిచిపెట్టలేరు. కలల్లో కూడా సోషలిజం వుందంటాన్నేను. ఓసారి మనిషి పక్కమీద వాలి కళ్ళుమూయగానే పడవమీద షికారెళ్ళినట్లు నిద్రలో కలల లోకాల్లోకి వెళ్ళిపోతాడు. అంచేత కలలు కంటానంటే వద్దనే అత్తగారు కాని, మామగారు కాని, మరెవరూ కాని వుండరంటాన్నేను, స్వీట్ డ్రీమ్స్ (మధురస్వప్నాలు కలుగుగాక) అని దిండుమీద అమ్మాళ్ళు ముచ్చటగా కట్టుకుంటారుగాని సాధారణంగా అవన్నీ కన్నీటితో తడిసిపోతాయి. జేబురుమాలుకి సెంటు రాసుకుంటారు కాని నిజానికి దాన్ని మన మొహానికి పట్టిన మకిలిని జాగ్రత్తగా తుడుచుకోటానికే వాడతాముకదా! ఒకరి స్వీటు మరొకరికి హాటు- అలాగే ఒకరి మధురస్వప్నం మరొకరి పాలిటి పీడకల కావచ్చు. అదలా ఉణ్నీయండి.

మనకేదో సూక్ష్మశరీరం లాటిది వుండి వుండాలి. లేకపోతే కలల్లో మనం కాలాన్ని ఎలా ధిక్కరించగలం? నిద్రపోయినంత సేపట్లో జరిగిన కల. కాలంలో ముందుకు పోనూవచ్చు, వెనకకు రానూవచ్చు. వర్త

మానంలోంచి భూతకాలంలోకి భవిష్యత్తులోకి ఒక్కసారే వెళ్ళగలుగు తున్నాము కలలద్వారా-ఫరెగ్జాంపుల్ నేను చచ్చిపోయి, చచ్చిపోయిన నా శరీరాన్ని చూస్తున్నట్లు నాకోసారి కలొచ్చింది. నన్ను చాలా నాచురల్‌గా చూశాను. సైన్సు దీనినేమంటుందో. ఒకసారి చిన్నపిల్లనై బళ్ళోకి పుస్త కాలట్టుకు వెళ్ళినట్టూ పరీక్ష రాస్తున్నట్టూ కలొస్తుంది. ఆ కలలోనే కొంచెం సేపయాక ఎక్కడో వూళ్ళో ఏదో ఇంట్లో మా ఇంట్లో చచ్చిపోయిన



వాళ్ళతో కబుర్లు చెబుతున్నట్టూ, మళ్ళీ అంతలోనే ఒడియాలు పెడు తుండగా ఒడియాల చీరపైని మచ్చల్ని చూసి ఝడుసుకుని కేకపెట్టినట్టూ, జపాన్ వెళ్ళినట్టూ, నెహ్రూగారు మా యింటికొచ్చినట్టు, కొయ్య బీరువా పక్కన నిల్చున్నట్టూ యింకా రకరకాల కలలొస్తాయి నాకు. సినిమాల్లో తెలుపూ, నలుపూ, రంగురంగుల సినిమాలున్నట్టే మన కలల్లోకూడా బ్లాక్ అండ్ వైటూ, కలర్ డ్రీమ్సుంటాయి, రంగుల సినిమాల్లాగే రంగుల కలలు కూడా ఎంతో బావుంటాయి.

కొన్ని కలలు నిద్దట్లో గ్యాపకం వున్నట్లే వుంటాయి. మళ్ళీ తెల్లార

గానే అంతా ఖాళీ-ఇల్లు ఖాళీచేసినట్లు మనసులోంచి వెళ్ళిపోతాయి. అప్పుడు చెప్పలేనంత ఉక్రోషం వస్తుంది. కలలు నోట్ చేయడానికి ఒక పెన సలూ నోటుబుక్కూ దగ్గరుంచుకోవాలని అనుకుంటూనే మర్చిపోతాను.

ఓసారి నాకు వెంకటేశ్వరస్వామి కల్లో కొచ్చాడు. (ఏం లేదు. అంబోతు కల్లోకొచ్చింది) తరవాత పుట్టిన పిల్లాడికి శ్రీనివాసుడి పేరెట్టు కున్నాము. మా చుట్టాలమ్మాయికి ట్యూబెక్టమీ ఆపరేషన్ చేయించుకున్నాక సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్లోకొచ్చాడు. ఏం చేద్దామని మొగుడ్నడిగిందట. నేనేం చెయ్యలేను. పిల్లల్ని కనవలసింది నువ్వు. ఇటుచూస్తే దేవుడు అటు చూస్తే రాజు (ప్రభుత్వం) అంచేత నీకెన్ని సరదాలున్నా నన్నే సుబ్బరాజు అనో సుబ్బడనో పిల్చుకో సరిపోతుందన్నాట్ట. ఈ కేసు సుప్రీంకోర్టు (విధవత్తగారి) దాకా వెళ్ళిందట. అప్పుడావిడ లబోదిబోమని ఏడ్చి తను మరొక కలకని ఆ కలలో కుర్రసన్నాసుల్ని క్షమించమని దేవుడ్ని ప్రార్థించిందట. ఇంతకీ కలల్లో దేవుళ్ళు కనపడ్డం అనే ఆనవాయితీ ఓటి వుంది. ఓసారి ముందు జరగబోయేవి కూడా నాకు నిద్రలో తెలుస్తాయి. ఎవరేనా పోయేముందు ధ్వనిప్రధానమైన కలలొస్తాయి. తెల్లారేసరికి దుర్వార్త వచ్చి తీరుతుంది. ఓసారి మా పెద్దమామయ్యగారి ప్రావిడెంటు ఫండులో డబ్బు ఆయన పోయాకవస్తే అందులో ఓ వెయ్యి ఆయనకు కిట్టనివారెవరో పిల్ల పెళ్ళికని అప్పడిగితే మా పెద్ద అత్తయ్యగారు యిచ్చేశారు. "నాడబ్బు వాడి కెందుకిచ్చారు?" అని ఆయన నా కలలో కనిపించి గట్టిగా అడిగారు. మా మరో మావయ్యగారొచ్చి "నా డబ్బు యింకా వుంది. నాకు తద్దినాలు పెట్టడం ఎందుకు మానేశారని" కల్లో కనిపించి నిలదీసి అడిగారు.

మరోసారి మా చనిపోయిన ఆడబడుచు వచ్చి ఆకలేస్తోందంటే పీటేసి భోజనం పెట్టి పంపించాను.

అప్పుడప్పుడు కలల్లో భోజనాలు, ఫలహారాలు నేనే చేస్తున్నట్లు కలలొస్తాయి. తినేవాటి రుచికూడా నాకు తెలుస్తుంది. డబ్బులు నోట్లు దొరికి

నట్లు కూడా నాకు కలలొస్తాయి. లేవగానే చేతిలో దుప్పటి కొసలో చీర చెరగో వుంటుంది—అప్పుడు ఈ కల నిజం కాకూడదా అని బాధేస్తుంది. ఓసారి పాములు కరుస్తాయి.అవి పీకటం బాధ అన్నీ తెలుస్తూనే వుంటాయి. ఎవరో తరుము కొస్తూన్నట్లు, పారిపోదామంటే కాలూ చేయీ కదలవు. గొప్ప భయం వేస్తుంది. కల్లో నాకు తెలీనివాళ్ళెవరో వచ్చి నాకు తెలి యని భాషలో మాట్లాడుతారు. ఒకప్పుడు ఎవరోవచ్చి పద్యాలు, శ్లోకాలు, పాటలు కూడా పాడుతారు. అవి నేనెప్పుడు విన్నవి కావు. నాకు శాన్ స్క్రిట్ బాగా రానప్పుడు నా కలలోకెవరో వచ్చి ఓ సారి దక్షిణామూర్తి స్తోత్రం చదివారు. ఇవన్నీ ఎలా సంభవమో నాకు అంతు చిక్కదు.

ఓసారి మంచంమీద పడుకున్నాను. అది నిద్రకాదు నేను మేల్కొనే వున్నానని అనుకున్నాను. మావారొచ్చి పిలిచారు. తలుపు తీశాను. తీసినట్టే గుర్తు. ఆయన లోపలికొచ్చి మాట్లాడకుండా పక్కగదిలోకెళ్ళారు దుస్తులు మార్చుకుందుకు.

నేను మళ్ళీ వెళ్ళి చూసేసరికి అక్కడెవరూ లేరు. మా వారు తరు వాత గంటసేపటికి వచ్చారు తలుపు బాదుతూ. నాకు భయం వేసింది. మా వారు దయ్యంకాదు. బతికున్నవాళ్లు దయ్యాలవరు కదా భామా అన్నారు అఫ్‌కోర్సు—నేను కలగన్నానంటున్నారు. ఇలాటి మిష్టరీలు కూడా జరుగు తాయి. మా వారన్నారుకదా చిటికెన వ్రేలికికాని, ఉంగరానికికాని తాడుకట్టి కిటికీలోంచి సన్నగా బయటకు వదిలితే అది పట్టుకు లాగుతాను. నీకు మెలుకువొస్తుంది సఖీ అన్నారు. మీ తెలివి చట్టుబండలయినట్లే వుంది— ఆ తాడు ఎవరైనా లాగొచ్చుకదా నా ప్రాణానికి అన్నాను. అఫ్‌కోర్సు అని మూతి బిగించారు.

దేవుడి గూట్లో వున్న గంటని పందిరి మంచానికి కట్టి దానికో ట్వాయిన్‌దారం కట్టి గడపకవతల గొళ్ళేనికి ముడేశాము. ఆగంట లాగ్గానే

నేను 'వచ్చె వచ్చె' అంటూ పరిగెత్తేదాన్ని. ఓసారి కలగంటూ నిద్రపోతున్నాను. ఆ నిద్రలో నేను ఒక తోటలో కెళ్ళాను. అక్కడ గుళ్ళోంచి గంటలు వినిపిస్తున్నాయి. ఇంతలో ఎందుకో మెలకువొచ్చింది. మా వారు పందిరి మంచానికి కట్టిన గంటను మ్రోగిస్తున్నారు. ఇక్కడ నా దేవుడు లాగుతున్నాడు నిజమైన గంట. అది నా కల్లోకొచ్చి మ్రోగింది. తోట గుడీ చెరువూ పూలా అన్నీ కలలో నేను సృష్టించుకున్నవే - గంట వాయింపు మాత్రం వారిది ఈసారి వారు నిద్రపోతున్నపుడు నేను హార్మణీ వాయిస్తాను. దాన్తో తిక్క కుదురుతుంది. ఎవరి కలలు వారివే-ఒకరి కలల జోలికి మరొకరు పోరాదు. చెరపకురా చెడేవు. సీతులు చెప్పేడప్పుడు మొగుళ్ళను రా, రీ, ఓ ఓయీ ఓరీ, అనొచ్చునన్నాడు చిన్నయ సూరి, దట్సాల్ —